
# పంటికింద
# తాళిబొట్లు



# పంటికింద పోకచెక్క

కొమ్ములు తిరిగిన డాక్టర్లకి అంతు పట్టని జబ్బులని ఒక హోమియోపతీ వైద్యుడు కుదర్చగలడని ఎవరయినా గప్పాలు కొడితే ఎవరు మాత్రం ఎలా నమ్మగలరు? అందులోనూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా పుచ్చుకున్న నేనా?

ఘోషాసుపత్రికి ఎదురుగా ఉన్న వీధిలోనే మా అత్తవారి ఇల్లు. రామేశం పంతులుగారి ఇల్లు అంటే ఆ ఊళ్లో తెలియని వారుండరు. గేటు తెరుచుకుని వాకలి నిండా ఉన్న అరటి చెట్లని దాటుకుని వెళితే పర్ణశాలలా చిన్న ఇల్లు కనిపించేది. ముందు వరండా. ఆ వరండాని ఆనుకుని ఉయ్యాలా గది. దానికిరువైపులా పడక గది, దేవుడి గది. ఆ దేవుడి గది గోడ మీంచి ఒక పంచపాళీ దింపి దాన్ని వంటగదిలా వాడుకునేవారు. ఆ వరండాకి ఒక చివర పడక గదిని ఆనుకుని చిన్న పీలికంత కొట్టు. ఆ కొట్లోనే మందుల పుస్తకాలు, మందుల పెట్లు ఉండేవి. అందుకని దానిని మందుల కొట్టు అనేవారు. ఆ మందుల కొట్టు బయటే, వరండా మీద ఒక పెద్ద బల్ల ఉండేది. కచేరీలో పనయి ఇంటికొచ్చిన తర్వాత రామేశంగారు ఆ బల్లమీద కొలువు తీర్చేవారు. పెద్దనక, పిల్లనక, ఉన్నవాళ్లనక, లేనివాళ్లనక, ఊరు వాళ్లనక, పైఊరు వాళ్లనక, ఎప్పుడూ ఎవ్వరో ఒకరు గుమ్మంలో పంతులుగారి సలహా కోసం ఎదురు చూస్తూ ఉండేవారు.

ఆ రోజు ఆదివారం. సంత పని చూసికొని మరీ పొద్దెక్కి పోకుండా నాలుగు మెతుకులు కతికి, అలవాటు ప్రకారం చుట్ట చుట్టిన పరుపుని ఆసరాగా పెట్టుకుని, కునుకు తీద్దామన్న ఉద్దేశంతో నడ్డి వాల్చి, రాత్రి అల్లుడు తెచ్చిన పుస్తకం చదవడం మొదలు పెట్టేరు రామేశంగారు. ఇంతలోనే వీధి గుమ్మంలో కారు ఆగింది. కారు తలుపు తెరుచుకుని ఒకామె, ఆమె వెనకాతలే ఒక చిన్న అమ్మాయి దిగేరు. పొరుగూరినుండి పక్కనున్న ఘోషాసుపత్రికి ఎవరో పేషెంట్లు వచ్చి ఉంటారని అనుకుని రామేశంగారు పుస్తకంలో దూర్చేసిన తలని పైకి తియ్యదలుచుకో లేదు. ఇంతలో ఇద్దరూ గేటు తెరుచుకుని లోపలికి రావడం వాలుకంటితో గమనించిన రామేశంగారు

"అమ్మాయీ, ఎవరో వచ్చేరు చూడమ్మా" అని అనడమూ,

"రామేశంగారి ఇల్లు ఇదేనా?" అని ఆవిడ వాకబు చెయ్యడమూ ఒక్కసారే జరిగేయి.

తండ్రి పిలుపుకి కూతురు బయటకు వచ్చి ఆగంతకులని పరకాయించి చూసింది. పెద్దామెకి ముప్ఫయి దాటి ఉండవు. ఆమె దేహ కాంతిలో పాల మీగడ లాంటి స్నిగ్ధత పాలు ఎక్కువ, దబ్బపండును పోలిన పసిమి పాలు తక్కువ. దమ్మిడీ అంత బొట్టు, సింగారంగా చుట్టిన సిగ, చెవులకి రవ్వల దుద్దులు, సన్నటి శంఖం లాంటి పొడుగాటి మెడ, పువ్వుల వాయిలు చీర, చేతిలో చేతిసంచీ, కాళ్లకి చెమ్కీ చెప్పులు. పిల్లకి పదేళ్లు ఉంటాయేమో.

''ఎవరు కావాలండీ?''

''అమ్మా, రామేశం పంతులుగారు ఉన్నారా?''

''నేనేనండి రామేశాన్ని'' అని అంటూ రామేశంగారు బల్లమీద లేచి కూర్చుని, ''ఎవరి తాలూకమ్మా?'' అని అడిగేరు.

''నన్ను స్వరాజ్యలక్ష్మి అంటారండి. నారికేళవలస జమీందారు గారి తాలూకండి. మా వారే వద్దామనుకున్నారు కాని ఆయనకి వ్యాపకాలు ఎక్కువ.''

''నారికేళవలసంటే బరంపురం దగ్గర కాదూ? జగన్మోహనరావు బహద్దరుగారికి బంధువులనుకుంటాను...?'' అంటూ అర్ధగర్భితంగా మాటని మధ్యలో ఆపేసి, ఏమిటిలా వచ్చేరు? దయచేయండి'

ఈ కుశల ప్రశ్నలిలా అవుతూ ఉండగా కూతురు వచ్చిన వారికి వరండాలో చాప వేసి కూర్చోబెట్టి, సేద తీర్చుకుందికి చల్లటి మంచినీళ్లు ఇచ్చి, చెయ్యవలసిన కనీసపు మర్యాదలు చేసింది.

''మా సరోజకి వచ్చిన రోగం ఏమిటో తెలిసికుందామని తిరగని ఊరు లేదండి. వైజాగు నుండి వెల్లూరు వరకు అన్నిఊళ్లూ తిరిగేమండి....'' చల్లకొచ్చి ముంత దాచడమెందుకని వచ్చిన పనేమిటో కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది స్వరాజ్యలక్ష్మి.

''పడిశం పడితే పల్సటిల్లా, దెబ్బ తగిలితే ఆర్నికా అనుకుంటూ ఇంట్లో పిల్లల కోసం నేర్చుకున్న పంచదార మాత్రల వైద్యం అమ్మా నాది. ఏదో ఆప్తులు అడిగితే కాదనలేక ఒక మాత్ర అడపా తడపా ఇచ్చేనేమో. మీరేదో నామీద గౌరవం కొద్దీ వచ్చేరు. సంతోషం. కాని ఇది నా తలకి మించిన పని. పిఠాపురం డాక్టరుకి చూపించక పోయారా?''

''పిఠాపురం డాక్టర్లు, బెండపూడి యోగులు, పెందుర్తి భూత వైద్యులు, అంతా అయ్యారండి. మేము చూడని స్పెషలిస్టు లేడండి. ఆఖరికి యలమంచిలిలో ఓరుగంటి సోమసుందరం గారు లేరండీ. వకీలు గారు. ఆయన మీ కాళ్లమీద పడమని సలహా ఇచ్చేరండి. మీరు కాదంటే వల్ల కాదు.''

స్వరాజ్యలక్ష్మి ఇలా అంటూ ఉండగానే డ్రయివరు చేత్తో ఒక సజ్జ పట్టుకుని యజమానురాలి కనుసన్న కోసం ఎదురు చూస్తున్నాడు. వాటి మీద ప్లేస్టిక్ సంచిలో కంచి పట్టు చీర, రవికల గుడ్డ, పైన పసుపు, కుంకం, ఆకులు, వక్కలు ఉన్నాయి. సజ్జని డ్రయివరు చేతిలోంచి అందుకుని, కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వంట గదిలోంచి బయటకు వచ్చి ఉయ్యాల గది తలుపు చాటున నిలబడ్డ సీతమ్మగారి చేతికి ఇచ్చి ఆవిడ పాదాలకి దండం పెట్టింది స్వరాజ్యలక్ష్మి.

''అమ్మా మీరు నా తరఫున ఒక్క మాట బాబు గారితో చెప్పి....''

ఈ తతంగం అంతా ఇలా జరుగుతూన్నంత సేపూ సరోజ ఉలుకూ, పలుకూ లేకుండా, బెల్లం కొట్టిన రాయిలా, కదలకుండా, మెదలకుండా అలా అక్కడ వరండాలో ఒక

కర్ర కుర్చీలో కూర్చుని ఉంది. విగ్రహం అంటే వరండాలో ఉంది కానీ, దృష్టి మాత్రం ఎక్కడో ఉంది. రామేశంగారు ఓర కంటితో పిల్లని పరికించి చూస్తున్నారు.

సీతమ్మగారు పళ్లెం అందుకుని, ఏవో క్షేమసమాచారపు ప్రశ్నలు రెండు వేసి,

"ఎండకి బాగా అలసిపోయినట్లు కనబడుతున్నారు. ఏదయినా ఫలహారం చేసి పట్టుకు వస్తాను" అని లోపలికి వెళుతూ, "ఆ పంకా పట్టుకొచ్చి ఇక్కడ పెట్టమ్మా" అని కూతురుకి పురమాయించేరు.

"ఎంత ఎండా కాలంలో నయినా ఉదకమండలంలా ఉండే మన వరండాలో ఫేను ఎందుకర్రా" అంటూ రామేశం గారు అతిథిని ఉద్దేసించి మళ్లా అందుకున్నారు.

"చూడండమ్మా. ఎండ వేళప్పుడు వచ్చేరు. ఒక గంటేనా మీరు ఇక్కడ కూర్చుని సేద తీర్చుకోకుండా ఎలాగూ మా అవిడ మిమ్మల్ని తిరిగి వెళ్లనివ్వదు. ఈ లోగా నాలుగు ప్రశ్నలు అడుగుతాను. మీకు చేతనయిన మేరకు సమాధానాలు చెప్పండి. నాకు చేతనయిన సలహా ఇస్తాను.

"పిల్ల చూడ్డానికి అర్భకంగా కనిపిస్తోంది. పుట్టినప్పటినుండీ ఇలానే ఉండేదా, లేక ఈ మధ్య ఏమయినా సుస్తీ చేసిందా?"

ఈ ప్రశ్నకి తల్లి సమాధానం చెప్పేలోగా సరోజ గొంతుకలోంచి ఒక వింతైన శబ్దం వచ్చింది. గదిలో పిల్లిని బంధించి, తలుపుకి గొళ్లెం పెట్టినప్పుడు పిల్లి పెట్టే కూతలా ఉంది ఆ శబ్దం.

"ఛప్, సరూ. ఆ చప్పుడు చెయ్యవద్దని ఎన్ని సార్లు చెప్పేను. పెద్దవాళ్ల ఎదట అలా ప్రవర్తించ వచ్చా?"

సరోజ దృష్టి మాత్రం ఎక్కడో ఉంది. కాని తల్లి గదమాయింపుకి ప్రతి స్పందనా అన్నట్లు ఆ చప్పుడు చెయ్యడం ఆపేసింది.

"సరోజ సాధారణంగా చాల బుద్ధిమంతురాలు. ఆ మాయదారి రోగం ప్రకోపించినప్పుడల్లా ఇలా వింతగా ప్రవర్తిస్తూ ఉంటుంది. నేను వర్ణించి చెపితే ఎవరూ నమ్మరు. మీరు చూస్తున్నారు కదా. అదీ ఈ పిల్లకి వచ్చిన మాయదారి రోగం."

రామేశంగారు సరోజని పరికించి చూస్తున్నారు. కాని ఆ పిల్లలోకమే వేరు.

"వెల్లూరులో కాని, వైజాగులో కాని పిల్ల 'ఆటిస్టిక్' అని ఎవరయినా చెప్పేరా?"

స్వరాజ్యలక్ష్మికి 'ఆటిస్టిక్' అన్న మాట అర్థం కాలేదు.

రామేశంగారు ఈ విషయం పసికట్టి, " 'ఆటిజం' అంటే చుట్టూ ఉన్న ప్రపంచంతో నిమిత్తం లేనట్టు ప్రవర్తిస్తూ పగటి కలలు కనే మనో దౌర్భల్యం. ఈ రకం మానసిక రోగులని 'ఆటిస్టిక్' అంటారు."

"లేదండి. ఈ రోజంటే ఇలా ఉంది కానీ రోజా చాల కలుపుగోలుగా ఉంటుంది. ఆ మాయదారి రోగం వచ్చినప్పుడు మాత్రం దయ్యం పట్టిన పిల్లలా ఇలా తయారవుతుంది."

"ఎంత తరచుగా వస్తూ ఉంటుందీ విజృంభణ?"

ఏటికి ఒక సారో రెండు సార్లో వస్తుందీ పిశాచం. వచ్చినప్పుడు ఇలా ఉంటుంది. లేనప్పుడు చిలకలా ఉంటుంది. ఎప్పుడు వస్తుందో తెలెయదు. మన అదృష్టం బాగుండి ఈ రోజు మీరు చూస్తూ ఉండగా వచ్చింది. మేం రాయవెల్లూరు వెళ్లినప్పుడు ఆసుపత్రిలో నెల్లాళ్లు మకాం వేశాం. పిల్ల చిలకలా ఉంది. డాక్టర్లు చూస్తూ ఉండగా ఒక్కసారి రోగం విజృంభించేలా చెయ్యి నాయనా అని వెంకట రమణమూర్తికి మొక్కుకున్నాను కూడా. లేని పోని రోగాలని పిల్లకి ఆపాదించే పిచ్చిదానిగా నన్ను జమ కట్టిస్తారేమోనని భయపడ్డాను. పోనీ లెండి. ఇప్పటికయినా ఆ దేవుడికి దయ కలిగింది.''

''ఇది వచ్చినప్పుడు ఎంత సేపు ఉంటుంది?'' ఈ జబ్బు ఇదమిద్ధంగా `ఇదీ' అని ఇంకా తేలలేదు కనుక, దాన్ని ఏ పేరు పెట్టి పిలవాలో తెలీక, రామేశంగారు `ఇది' అనేసి ఊరుకున్నారు.

''వచ్చినప్పుడల్లా రోజో, రెండ్రోజులో, వారమో, రెండు వారాలో ఉంటుంది. ఎప్పుడొస్తుందో తెలియదు. ఎన్నాళ్లుంటుందో తెలియదు.''

''ఇది మూర్ఛ రోగమని ఎవరయినా నిర్ధారణ చేసేరా?''

''మెద్రాసులో డాక్టర్లకి చూపించేమండి. బుర్రకి తీగలు తగిలించి బుర్రలోని నాడీ తరంగాలని పరీక్షించి చూసేరండి. కనీసం పదిసార్లయినా, రక్తపు పరీక్ష అన్న మిషతో చిట్టితల్లి చేతులనిండా తూట్లు పెట్టేసేరండి. ఇప్పుడు మీరే చూస్తున్నారు కదా? ఇది నా బుర్రకి వచ్చిన రోగమా? లేక నా చిట్టితల్లిని పీడిస్తూన్న దయ్యమా?''

''పరీక్షలేనా? లేక ఎవ్వరయినా ఏదయినా మందు ఇచ్చేరా?''

''ఒక డాక్టరు మూర్ఛ రోగమని `డైలేన్‌టిన్ సోడియం' ఇచ్చేరండి. కిందటి వారం వైజాగులో మరొక డాక్టరు `టెగ్రిటాల్' వాడమన్నారండి. ఏ మందు వాడినా వీసమెత్తు గుణం కనిపించడం లేదండి. అసలు ఈ వైద్యాల వల్ల లేని రోగాలు తెచ్చి పెట్టుకుంటున్నామేమోనని భయంగా కూడా ఉందండి.''

రామేశంగారికి ఈ రోగం యొక్క ఆద్యంతాలు అర్థం కాలేదు.

''అమ్మాయికి మొట్ట మొదట సారి `ఇది' వచ్చినప్పుడు వయస్సు ఎంత?''

స్వరాజ్యలక్ష్మి మెల్లిగా పూర్వ చరిత్ర చెప్పుకు రాసాగింది.

''సరోజకి మూడేళ్ల వయస్సు వచ్చే వరకు ఏ రోగమూ, రొష్టూ లేకుండా చిలకలా ఉండేది. మూడేళ్లప్పుడు మెద్రాసులో మావయ్య ఇంటికి వెళ్లింది. అక్కడ అరుగు మీదనుండి కింద పడి మోచెయ్యి విరగ్గొట్టుకుంది. అప్పుడు ఆ చేతి మీద శస్త్రం చెయ్యవలసి వచ్చింది. ఆ సందర్భంలో మత్తుమందు వాడేరు. కోతి పుండు బ్రహ్మరాకసి అయింది. సర్జరీ అయిన తర్వాత పిల్లకి మరి మెలుకువ రాలేదు. పిల్ల `కోమా' లోకి వెళ్లి పోయింది. మత్తుమందు పడక మెదడు దెబ్బ తిన్నాదేమోనని అనుమాన పడ్డారు. ఊళ్లో పెద్ద పెద్ద ఆసుపత్రులు ఉన్నాయి కనుక `సీటీ స్కేను' తీసి చూడ గలిగేరు. మెదడు బాగానే ఉందన్నారు. తర్వాత `ఏంటీ బయాటిక్కులు',

'స్టీరాయిడ్లు' ఇలా ఒకటేమిటి, డాక్టర్లు ప్రయత్నం చెయ్యని మందు లేదు. ఫలితం మాత్రం సూన్యం. పిల్ల చచ్చిపోయిందనే అనుకున్నాను. గుడ్డిలో మెల్ల. బతికి బయట పడింది.''

రామేశంగారు అంతా శ్రద్ధగా వింటున్నారు. మత్తు మందులోంచి వెంటనే తేరుకుని బయట పడలేదు. అది ఒకటి. ఈ మత్తుమందు వాడిన తర్వాతే సరోజకి ఈ వింత జబ్బు వచ్చింది. ఈ రెండింటికి ఏమిటి సంబంధం?

''అలా కోమాలో పిల్ల ఎన్నాళ్లు ఉంది?''

''రెండు వారాలండి. ఆ రెండు వారాలూ రెండు యుగాలులా గడిచేయండి. పిల్ల పక్కని జాగరం చేసేనండి. అక్కడ డాక్టర్లు వాళ్లకి తెలిసినంత వరకు పిల్లకి ఏ జబ్బూ లేదన్నారండి. కాని కోమాలోకి ఎందుకు వెళ్లి పోయిందో, కోమాలోంచి బయటకు ఎప్పుడు వస్తుందో చెప్పలేమన్నారండి.

''ఈ డాక్టర్ల మీద ఆధారపడి లాభం లేదని నేనే చొరవ తీసికొని అక్కడ గ్రంధాలయంలో ఉన్న పుస్తకాలెన్నో తిరగేసి చూసేనండి. గ్రీకు భాషలో 'కోమా' అంటే ఘాటైన నిద్ర అని అప్పుడు తెలిసిందండి. ఈ రకం ఘాటు నిద్రలో ఉన్న వారికి పక్కన బాంబు వేసినా మెలుకువ రాదుట. సూదితో గుచ్చినా మెలుకువ రాదుట. అంత తీక్షణమైన నిద్రట. కోమాలో పడ్డవారి జ్ఞానేంద్రియాలకి మూతలు పడిపోయాయన్నమాట. మనవాళ్లు 'చెవులకి గెడలు పడిపోయాయి' అనేమాటని వాడతారు. అదేనేమో కోమా అంటే. ఏది ఏమయితేనేమి, కోమాలో పడ్డ వాళ్లకి మళ్లా మెలుకువ వచ్చి మనవాళ్లు కావాలంటే వాళ్లతో మనం మాట్లాడుతూ ఉండాలిట. వాళ్ల శరీరాన్ని నిమురుతూ ఉండాలిట. అలా కొన్నాళ్లకి మన అదృష్టం బాగుంటే జ్ఞానేంద్రియాలకి పడ్డ మూతలు తెరుచుకునే అవకాశం ఉందిట. అందుకని సరోజ చేతులు నిమురుతూ, ఇష్టమయిన పాటలు పాడుతూ, కబుర్లు చెబుతూ పిల్లని ఒక్క క్షణం వదలకుండా పదిహేను రోజులు కాపలా కాసేను. నా నోములు ఫలించేయి. ఒక రోజు సరోజ అకస్మాత్తుగా లేచి 'అమ్మా' అని పలకరించింది. అంతే.''

స్వరాజ్యలక్ష్మి ఇలా కథనం చెనుతూ ఉంటే సరోజ రామేశంగారు కూర్చున్న బల్ల దగ్గరకి వెళ్లి, బల్ల మీద బుగ్గని అనించి, అలా విగ్రహంలా నిలబడి ఉంది.

రామేశంగారు పిల్లని ఎగా దిగా చూసి, కొంచెం కంగారు పడి, పిల్ల చేతిని తన చేతిలోకి తీసికొని నాడిని పరీక్షించడం మొదలు పెట్టేరు.

''మరేమీ పరవా లేదండి. ఆ రోగం వచ్చినప్పుడల్లా ఈ ప్రవర్తన ఇలాగే వింతగా ఉంటుందండి.'' అని స్వరాజ్యలక్ష్మి ధైర్యం చెప్పింది.

''ఈ మొదటి సంఘటన తర్వాత పిల్ల మామూలుగా అయిపోయిందా?''

''ఏం మామూలండి. పక్షవాతం వచ్చినట్లు ముఖం కుడి పక్క అంతా వాచి పోయిందండి. ఈ వాతంతో జన్మ అంతా బాధ పడాల్సిందే అని డాక్టరు తీర్మానించి చెప్పేరండి. కాని డాక్టర్లు చెప్పింది ఎప్పుడు నిజం అయిందండి? వారం రోజుల్లో వాతపు లక్షణాలన్నీ హరించుకు పోయాయండి. పూర్తిగా నయం అయిపోయిందనే అనుకున్నానండి.

కాని మళ్లా ఎప్పుడో ఆ రోగం కమ్ముకు వస్తుందండి. ఆ తర్వాత ముఖానికి వాతం కమ్ముతుంది. తర్వాత అదే సర్దుకుంటుంది.''

రామేశంగారు బల్ల పక్క గూట్లో ఉన్న పలక, బలపం తీసికొని ఆ పలక మీద వరసగా `మత్తుమందు వాడిన తర్వాత మొద్దు నిద్ర', `ముఖానికి పదే పదే పక్షవాతం' అని రాసుకొంటూ

''ఇప్పటికి ఈ రుగ్మత ఇన్నిసార్లు ఇలా విజృంభించి ఉంటుందంటారు?''

''ఏటికి రెండు, మూడు సార్లు వస్తూందండి. ఇప్పటికి పాతిక సార్లయినా వచ్చుంటుందని నా అంచనా.''

''ఇంకేమయినా చెప్పగలరా? కొంచెం జ్ఞాపకం చేసికోండి.''

స్వరాజ్యలక్ష్మి కొద్ది సేపు ఆలోచించి, తనకి తట్టినది చెప్పదగ్గ లక్షణం అవునో కాదో అని తటపటాయించి, ''ఇది వచ్చినప్పుడల్లా మాట ఖణిగా రాదండి.''

''మాట ఖణిగా రాదు'' అని పలక మీద రాసుకున్నారు రామేశంగారు.

నిద్ర లేమి కూడానండి. ఇది వచ్చినప్పుడు రెండు, మూడేసి రోజులు అస్సలు నిద్ర పోనే పోదండి. తను నిద్ర పోక పోతే, ఎక్కడ దెబ్బలు తగిలించుకుంటుందో అన్న భయంతో నేను నిద్ర పోలేనండి. అలా అనుక్షణం కాపలా కాస్తానండి.

ఇప్పుడు రామేశంగారికి అర్థం అయింది. స్వరాజ్యలక్ష్మి ముఖం ఎందుకు అలా అలసిపోయినట్లు కనిపిస్తోందో. పలక మీద `నిద్రలేమి' అని రాసుకుంటూ,

''అమ్మా, ఆ బీరువాలో ఉన్న ఎర్ర బైండింగు ఉన్న పుస్తకం ఒక సారి ఇలా పట్రా తల్లీ'' అని కూతురుకి పురమాయించేరు.

ఆయన అలా రాసుకుంటూ ఉంటే ఎందుకో స్వరాజ్యలక్ష్మికి ధైర్యం పెరిగి మరొక విషయం జ్ఞాపకం తెచ్చుకుంది.

''ఆకస్మాత్తుగా రెండు, మూడు పర్యాయాలు `నొప్పి, నొప్పి' అని బాధ పడిందండి. ఒక సారి గుండెల్లో నొప్పి వస్తే హార్ట్ ఎటాక్ అన్నారండి. చిన్న పిల్లకి హార్ట్ ఎటాక్ ఏమిటండి? మరొక సారి కడుపులో నొప్పి వస్తే ఎపెండిసైటిస్ అని ఆపరేషను చేస్తామన్నారండి. ఒక సారి ఆపరేషను చేయించి అనుభవిస్తున్నాం కదా. అందుకని ఒప్పుకోలేదండి. నొప్పి దానంతట అదే తగ్గి పోయిందండి.''

రామేశంగారు పలక మీద ఉన్న జాబితాని ఒక సారి తేరిపార చూసేరు.

''మత్తు మందు, మొద్దు నిద్ర, ముఖానికి పక్షవాతం, మాట నములుడు, నిద్రలేమి, నొప్పి''

ఆయన కనుబొమ ముడి పడింది. ఈ లోగా కూతురు పుస్తకాన్ని తండ్రికి అందించింది. ఆ పుస్తకం కొంత సేపు ఇటూ, అటూ తిరగేసి, తర్వాత తలగడ కింద దాచిన అల్లుడు తెచ్చిన పుస్తకాన్ని ఒకసారి సంప్రదించి, తల పైకైనా ఎత్తకుండా,

''జబ్బు చేసినప్పుడు పిల్ల మూత్రం రంగులో ఏదయినా మార్పు గమనించేరా?''

ఈ ప్రశ్న వినగానే స్వరాజ్యలక్ష్మి ముఖ కళవళికలలో వచ్చిన మార్పుని వర్ణించడం కష్టం, చూసి తీరాల్సిందే.

''ఏడేళ్ల బట్టి దేశం అంతా కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నానండి. బాబూ, మీరే ఈ ప్రశ్న వేసేరు. పిల్లకి జబ్బు చేసినప్పుడల్లా మూత్రం కొంచెం ముదురు రంగులో, అంటే, ద్రాక్ష రసం రంగులో, పడుతుందండి. మీరు అడిగే వరకూ, అ జబ్బుకీ, దానికీ సంబంధం ఉందనే అనుకోలేదు.''

కూతురు జబ్బు అప్పుడే నయం అయిపోయినంత ఉత్సాహం ఆవిడ కంఠంలో ద్యోతకమయింది.

''అమ్మా, మీ అమ్మాయిని పట్టి వేధిస్తూన్న జబ్బు ఏమిటో కొంచెః ఆచూకీ దొరికింది. లక్షణాలని బట్టి ఇది 'ఎక్యూట్ ఇంటర్‌మిటెంట్ పోర్ఫీరియా' అన్న జబ్బులా కనిపిస్తోంది. నా అనుమానమే నిజం అయితే ఇది చాల అరుదుగా వచ్చే జబ్బు. ఈ జబ్బుని నేను కుదర్చ గలనో లేనో చెప్పలేను....''

''బాబుగారూ, ఇంతవరకు అందరూ పిల్లకి ఏ జబ్బూ లేదని డబాయించిన వారే. తమరు కుదర్చ గలిగినా, కుదర్చ లేకపోయినా పరవా లేదు. మా రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది. కనీసం ఆ జబ్బు ఏమిటో మాకు అర్థం అయేటట్లు చెప్పండి'' అని స్వరాజ్యలక్ష్మి ప్రాధేయ పడింది.

ఈ లోగా సీతమ్మగారు ఫలహారం పట్టుకొచ్చి తినమని బలవంతం చెయ్యడంతో, స్వరాజ్యలక్ష్మి మొహమాట పడుతూనే పుచ్చుకున్నారు.

'''ఎక్యూట్ ఇంటర్‌మిటెంట్ పోర్ఫీరియా' వంశ పారంపర్యంగా వచ్చే జబ్బని రామేశంగారికి తెలుసు. పిల్లకి ఈ జబ్బు వచ్చిందంటే అంకురం తల్లిదండ్రులలో ఉండి తీరాలి. ఎటునుండి వచ్చిందో తెలుసుకుందామని, ఆవిడ ఫలహారం చేస్తూన్నప్పుడే రామేశంగారు అడగడం మొదలు పెట్టేరు.

''మీరు చూలింతరాలుగా ఉన్నప్పుడు మీ ఆరోగ్యం ఎలా ఉండేది?''

స్వరాజ్యలక్ష్మి ఆశ్చర్యానికి అంతు లేదు. 'ఈయన ఆవలిస్తే పేగులు లెక్క పెట్టేస్తున్నాడు' అని లోలోపలే అనుకుని, పిల్ల మూత్రం రంగుకీ తను గర్భవతిగా ఉన్నప్పుడు తన ఆరోగ్యానికీ మధ్యనున్న బాదరాయణ సంబంధం అర్థం కాక,

''బాబుగారూ, మీరు నా ముఖం చూసి నా జాతకం చెప్పేస్తున్నారు. నేను సరోజని మోస్తూన్నన్నాళ్లూ మంచం మీదే ఉన్నాననుకోండి. రెండు సార్లు ఆసుపత్రిలో కూడ చేర్పించ వలసి వచ్చింది. మొదటి సారి నెల తప్పేనని తెలిసిన కొద్ది రోజులకే నాకు విపరీతమయిన కడుపు నొప్పి వచ్చింది. కడుపు పోతుందని కంగారు పడ్డాం. డాక్టర్లకి అర్థం కాక కడుపుని కోసి లోపల ఏముందోనని చూసేరు. ఏమీ లేదని తేల్చేరు. తర్వాత కడుపు నొప్పి ఎలా వచ్చిందో అలానే పోయింది.''

''రెండవ సారి?''

``ఒక నెల్లాళ్లు పోయిన తర్వాత. ఒకటే వాంతులు. వేవిళ్లనుకున్నాను. ఆసుపత్రిలో ఆరు వారాలు ఉన్నాను. శరీరం ఎండిపోతూ ఉంటే `సేలీను` ఎక్కించి బతికించేరు.

సరోజకి వచ్చిన జబ్బేమిటో అదే జబ్బు ఆ తల్లికి కూడా ఉందని పంతులుగారికి తెలిసి పోయింది. లక్షణాలు తేడా. మరి కొంచెం తవ్వి చూడాలి.

``మీ వారి ఆరోగ్యం గురించి కొంచెం చెబుతారా?''

``ఆయన జన్మలో జిర్రున చీదెరగరు. వాళ్ల వాళ్లంతా ఆరోగ్యవంతులే.''

``మీ పుట్టింటి వారి ఆరోగ్యం సంగతి ఏమిటి చెప్ప గలరు?''

``మా వాళ్లంతా ఎప్పుడూ ఏవో జాడ్యాలతో మూలుగులేనండి. మా అమ్మ బాగానే ఉండేది. వైద్యుడి దగ్గర రహస్యాలు ఉండ కూడదు కదండి. మా నాన్న అడపా తడపా మయికంతో ఇంటికి వచ్చే వాడండి. తాగుడేమోనని మొదట్లో అనుమానించేం కాని, ఆయనకి ఆల్కహాలు పొడ కూడ కిట్టదండి. మా పెద్దత్తకి కూడ మూర్ఛ రోగం లాంటిదేదో ఉండేదండి. ...''

రామేశంగారు ఇక ఆలస్యం చేయ దలుచుకో లేదు.

``అమ్మా, ఇది వంశ పారంపర్యంగా సంక్రమించే జబ్బని నా మనస్సు ఘోష పెడుతోంది. మీ తండ్రిగారు తాగిన వాడిలా తూలుతూ కనిపించేరంటే, అది కూడ ఈ రోగ లక్షణమే అని నా అనుమానం. మీరు చూలింతరాలిగా ఉన్నప్పుడువచ్చిన కడుపు నొప్పి ఈ రోగ లక్షణమే అయి ఉంటుంది.''

``మరి ఈ జబ్బు నివురు కప్పిన నిప్పులా ఉన్నా మేమంతా జీవితాలు ఈడిచెస్తున్నాము కదా, మా సరోజ ఏం పాపం చేసుకొంది. దయ్యం పట్టిన దానిలా అలా తిరుగుతోందే.''

``ఇది జన్యు రోగమమ్మా. ఇవి అందరిలోనూ ఒకేలా ప్రకోపించవు. సరోజలో ప్రకోపన ఎక్కువగా ఉంది. అది మీ దురదృష్టం.''

`బాబుగారూ, మీరు చెప్పిన మాటలన్నీ అమృత వాక్కులలా ఉన్నాయి. మీ అమృత హస్తంతో మీరే మా సరోజ నోట్లో మూడు మాత్రలు వేసి ఇంత పుణ్యం కట్టుకొండి. మీకు రుణ పడి ఉంటాను.''

రామేశంగారి మస్తిష్కంలో ఒక నైతిక సమస్య ఎదురయింది. జన్యు రోగాలు జీవ కణాలలో ఉన్న వారసవాహికలలో ఉన్న లోపాల వల్ల వస్తాయి. ఈ వారసవాహికలు పిల్లకి తల్లిదండ్రుల దగ్గరనుండి సంక్రమిస్తాయి. వీటిల్లోనే మన భవిష్యత్తు అంతా రాసి పెట్టి ఉంది. కనుక జన్యు రోగాలని కుదర్చడం అంటే విధి వ్రాతని మరమ్మత్తు చెయ్యడం లాంటిది. ఈ రకం జబ్బులకి మందు లేదని చెప్పడమా, లేక మందు వేస్తూన్నట్లు నటించి, రోగికి కొంత నమ్మకం కలిగించి, జబ్బు ఉపశమనానికి పునాది వెయ్యడమా?

``అమ్మా, `ఎక్యూట్ ఇంటర్‌మిటెంట్ పోర్‌ఫీరియా` కి ఇంగ్లీషు వైద్యంలో ప్రస్తుతానికి మందు లేదు. హోమియోపతీలో ఫలానా జబ్బుకి ఫలానా మందంటూ ఎప్పుడూ

లేదు. ఒక వ్యక్తిని సమగ్రంగా పరీక్షించి, ఆ వ్యక్తి వ్యక్తిత్వానికి మందు ఇస్తాం కాని రోగ లక్షణాలకి కాదు. కనుక నేను మందిచ్చినా కుదురతుందని ఆశ పెట్టి ఇవ్వలేను. మందు వేసుకొని నేను చెప్పిన పథ్యాన్ని తు. చ. తప్పకుండా పాటిస్తే కొంత ఉపశమనం కలగ వచ్చు."

"చెప్పండి. ఇన్ని మందులు వాడి ఇంత కాలహరణం చేసేం. ఇది పని చేస్తుందనే ఆశగా ఉంది."

"మీరు మొట్ట మొదట చెయ్యవలసిన పని ఆ ఇంగ్లీషు మందులు మానెయ్యడం. ఆ 'డైలేన్‌టిన్ సోడియం', 'టెగ్రిటాల్' చెత్త కుండీలో పారెయ్యండి. తర్వాత పథ్యం. కర్బనోదకాలు ఎక్కువగా ఉన్న భోజనమే పెట్టండి. అంటే గుడ్లు, మాంసం పూర్తిగా మానేసి, అన్నం, దుంపలు మొదలయిన తినుభండారాలే పెట్టండి." అని చెప్పి, కూతురుని పిలిచి, "అమ్మా, మన మందుల పెట్టెలో, కింద అరలో, మూడో వరసలో ఉంటుంది, సేక్‌లేక్ సిక్సెక్స్ సీసా ఇలా పట్రా, తల్లీ" అని పురమాయించేరు.

కూతురు ముసిముసి నవ్వులు నవ్వుతూ పట్టుకొచ్చిన సీసా స్వయంగా పరీక్షించి, చేతి చెమట తగిలితే మందు గుణం చెయ్యదని చెబుతూ, అందులోని మాత్రలు తిన్నగా సరోజ నోట్లో పడేటట్లు వేసి,

"అమ్మా, నెల్లాళ్ల వరకు మరొక మోతాదు అక్కర లేదు. ఎందుకేనా మంచిది. వైజాగు వెళ్లి డాక్టర్ సత్యనారాయణ గారికి ఒక సారి చూపించండి. పిల్ల రక్తం పరీక్ష చేయమని ఉత్తరం రాసిస్తాను. నా నిర్ణయం సరి అయినది అవునో కాదో ఆయన రూఢి చేస్తే మీకూ ధైర్యంగా ఉంటుంది, నాకూ సంతృప్తిగా ఉంటుంది."

"బాబు గారూ, మీ మాట మీదే మాకు నమ్మకం అండి. కాని మీ మాట కాదనడం ఎందుకు. అలాగే చేస్తాను. ... మరి తమ ఫీజు ఎంతో..." అంటూ స్వరాజ్యలక్ష్మి లేచి నిలబడింది.

"అమ్మా, ఇంత వరకు నేను ఎవరినీ చిల్లి గవ్వ ఫీజుగా ఇమ్మని అడగ లేదు. సంతోషంగా, తమలపాకులు, అరటిపండు చేతిలో పెడితే నా కదే పది వేలు. అయినా అమ్మాయికి గుణం కనిపించాలిగా. క్షేమంగా వెళ్లి లాభంగా తిరిగి రాండి. శలవ్."

మావ గారి వైద్యం చేసే వయనం అంతా పడక గదిలోంచి పరికించి చూస్తూనే ఉన్నాను. స్వరాజ్యలక్ష్మి కారు బయలుదేరిన చప్పుడు విన్న తర్వాత వరండాలో మావగారి దగ్గరకి వచ్చేను.

"పెద్ద పెద్ద డాక్టర్లకి అంతు పట్టని విషయాన్ని మీరెలా పట్టేరండీ?" అని అడిగేను.

"చూడు అల్లుడూ, హోమియోపతీ వైద్యానికీ, అల్లోపతీ వైద్యానికీ మధ్య తేడా చెప్పనీ. ఇంగ్లీషు డాక్టరు దగ్గరకి వెళితే నిన్ను, రెండు మూడు నిమిషాల కంటె ఎక్కువ సేపు చూడడు. వాళ్లకి ఎంతమంది పేషెంట్లని చూస్తే అంత డబ్బు. స్వరాజ్యలక్ష్మి కథ వినడానికి నాకు గంట పైగా పట్టింది. ఈ సమయంలో వాళ్ల వంశం గురించి తెలుసుకో గలిగేను కనకనే ఇది జన్యు రోగమని నిర్ధారణ చెయ్యగలిగేను.

``ఇంగ్లీషు డాక్టర్లు రోగ లక్షణాలు వింటారు తప్ప రోగిని చూడరు. వాళ్ల దృష్టిలో ఈ శరీరం ఒక యంత్రం. రక్తం, మలం, మూత్రం, ... వీటన్నిటినీ పరీక్షిస్తారు తప్ప రోగిని మనిషిలా చూడరు. రోగి పది లక్షణాలు చెబితే పది మందులు రాసిస్తారు. రోగి సంసారం సంగతి వతళ్లకి అస్సలు అక్కర లేదు. హోమియోపతీ వైద్యం దీనికి వ్యతిరేకం. మాకు రోగం కంటె మనిషే ముఖ్యం. మనిషి, ఆ మనిషి యొక్క ఆలోచనా సరళి, ఆ వ్యక్తి అలవాట్లు, ఆ వ్యక్తి ఇంట్లో వాళ్ల అలవాట్లు – ఇవన్నీ మాకు కావాలి. రోగిని మనిషిగా అర్థం చేసికొనడం ప్రథమాంశం. రోగం కుదర్చడం ద్వితీయాంశం.

``కలకత్తాలో మహేంద్రనాద్ సర్కార్ అని పేరు పడ్డ హోమియోపతీ వైద్యుడు ఒకాయన ఉండేవాడు. ఆయన రోగి ముఖం చూసి, నడక తీరు చూసి, ఒక్క ప్రశ్న అయినా అడగకుండా ముందిచ్చి కుదిర్చేవాడుట. ఆ కథ మరొకసారి చెబుతా కాని...

``కాలం, కర్మం కలసి రావాలంటారు చూడు. అలాగ ఈ దినం నాకు కలిసొచ్చిన రోజు. రోగం విజృంభించిన సమయంలో సరోజని పరీక్ష చేసే సదవకాశం నాకొక్కడికే దక్కింది. మిగిలిన డాక్టర్లంతా సరోజని ఆరోగ్యంగా ఉన్నప్పుడే చూసేరు. నారికేళవలస జమీదారీ గురించి నాకు బరంపురంలో ఉద్యోగం చేస్తూన్నప్పుడు విన్న కథలు కొంత ఆధారాన్ని ఇచ్చేయి. ఆఖరికి నువ్వు నిన్న రాత్రి అనుకోకుండా రావడం కూడా కొంత వరకు ఈ కేసులో కాకతాళీయంగా కలిసొచ్చిందనుకో.

``రాత్రి నువ్వు పట్టుకొచ్చిన పుస్తకంలో 'బ్రిటిష్ రాజవంశంలో జబ్బులు' అన్న శీర్షిక కింద ఒక వ్యాసం ఉంది. బ్రిటిష్ రాజులలో మూడవ జార్జి మహారాజు ఒక వింతయిన జబ్బుతో బాధ పడేవాడుట. మన సరోజకి వచ్చినట్లే అడపా, తడపా, అనుకోకుండా లక్షణాలు పొడ చూపేవట. ఒణుకు, అపస్మారం, అర్థం కాని నొప్పి, నిద్రలేమి, మొదలయిన లక్షణాలు చూసి ఆ నాటి వైద్యులు ఏమీ చెయ్యలేక పోయారుట. కాని వాళ్లు చేసిన మంచి పని ఏమిటంటే జార్జి ప్రభువు లక్షణాలు, ఆయనకి వారు చేసిన వైద్యం వగైరాలు అంతా పూస గుచ్చినట్లు పుస్తకాలలో రాసి పెట్టేరుట. ఈమధ్య, అంటే 1966లో ఇద్దరు బ్రిటిష్ డాక్టర్లు ఆ పాత పుస్తకాల దుమ్ము దులిపి ఒక కొత్త సిద్ధాంతం లేవదీశారుట. ఆ సిద్ధాంతం ప్రకారం మూడవ జార్జి 'ఎక్యూట్ ఇంటర్‌మిటెంట్ పోర్ఫీరియా' తో బాధ పడ్డాడని తీర్మానించేరు. ఆ వ్యాసం నిన్న రాత్రే చదివేను. రెండూ, రెండూ కలిపేను. అంతే.

``ఈ జబ్బు ఇగ్లండు మొదలయిన పాశ్చాత్య దేశాలలోనే ఉంది. తెల్ల వాళ్ల సంపర్కం వల్ల మన దేశంలో కూడ వ్యాపించిందని నా అనుమానం.

``ఈ 'పోర్ఫీరియా' అనేది రక్త సంబంధమైన అనేక జబ్బులకి ఉమ్మడిగా వాడే పేరుట. ఈ జబ్బు ఉన్న వాళ్ల శరీరం రక్తచందురాన్ని సరిగ్గా తయారు చెయ్యలేదుట.

``ఈ రక్తచందురంలో 'హీమ్' అనే బణువు, 'గ్లోబిన్' అనే బణువు ఉంటాయని మనలొ చాల మందికి తెలుసు కదా. అందుకనే దీనికి ఇంగ్లీషులో 'హిమోగ్లోబిన్' అన్న పేరు

వచ్చింది. ఈ 'హీమ్' రక్తానికి ఎర్రని ఎరుపు రంగు నిస్తుంది. ఈ 'హీమ్' సహాయం తోటే రక్తం ప్రాణ వాయువుని శరీరం అంతటా మోసుకెళ్ల గలుగుతోంది.

"'పోర్ఫిరియా' ఉన్న వారి శరీరంలో ఈ 'హీమ్' తయారీకి కావలసిన ముడి పదార్థాలు తయారవతాయి కానీ అవన్నీ హీమ్ రూపం పొంద కుండా మధ్యంతరంగా ఆగి పోయి రక్తంలో అలా ఉండిపోతాయి. తత్ఫలితంగా శరీరం పాలిపోవడం, నీరసించడమే కాకుండా, రక్తం విష పూరితమవడం మొదలు పెడుతుంది. కొంత వరకు మూత్ర పిండాలు ఈ విష పదార్థాలని వడగట్టి మూత్రం ద్వారా బయటకు తోడేస్తాయి. అందుకనే ఈ జబ్బు చేసిన వారి మూత్రం కోకా కోలా రంగులో ఉంటుందిట. రక్తంలో ఈ విషం ఉన్నన్నాళ్లూ రకరకాలయిన దుర్గుణాలు కనిపిస్తాయిట. అవే నొప్పులు, తిప్పులు, వికారాలు గా మనకి ప్రస్ఫుటమవుతాయిట. ఇదంతా నువ్వు రాత్రి పట్టుకొచ్చిన పుస్తకంలో చూసేనోయ్.

"అసలు సరోజకి పుట్టుకతోటే ఈ రోగం వచ్చింది. మెడ్రాసులో చేతికి ఆపరేషను చేసినప్పుడు వాడిన మత్తు మందు పడి ఉండదు. పైపెచ్చు నిద్రాణంగా ఉన్న జబ్బు రెచ్చగొట్టబడి ఉంటుంది. ఈ రోజు జబ్బు ఉద్రేకించడానికి కారణం వారం రోజుల కిందట వాడిన ఫీనో బార్బిటాలే అని నా అనుమానం. అందుకనే 'టెగ్రిటాలు వెంటనే మానేయమని చెప్పేను."

"మావ గారి ప్రజ్ఞా పాటవాలకి ముక్కు మీద వేలేసుకుంటున్నాను" అన్నాను పక్కనున్న శ్రీమతితో.

"నారికేళవలసకీ, ఈ జబ్బుకీ ఉన్న సంబంధం ఏమిటో నాకు అర్థం కావడం లేదు" అంది శ్రీమతి.

"నారాయణరావు నవలలో నారికేళవలస జమీందారు ఒకాయన ఇంగ్లీషు వాళ్ల అమ్మాయిలతో జరిపిన కృష్ణ లీలల గురించి అడివి బాపిరాజు ప్రస్తావించేరు. బరంపురంలో ఉద్యోగం చేసిన వాడిని కనుక, అదంతా కట్టుకథ కాదని నాకు తెలుసు." అని రామేశంగారు మసాళా అందించేరు.

"'ఇది జన్యు సంబంధమయిన జబ్బు, దీనికి మందు లేదు' అని చెబుతూనే మీరు ఆ అమ్మాయికి ఏదో మందిచ్చేరు. ఇది ధర్మమేనా?" అని ప్లేటు మార్చేను, తెలుగు సాహిత్యం చదవనందుకు నన్ను నేనే నిందించుకుంటూ.

"నేను ఆ అమ్మాయి నోట్లో వేసినవి పంచదార మాత్రలోయ్. ఏదో మందు పుచ్చుకున్నానన్న సంతృప్తి, ఆ మందు పని చేస్తుందన్న నమ్మకం లేక పోతే ఏ జబ్బూ నయమవదోయ్."

"మరయితే మందేదీ ఇవ్వనప్పుడు....."

"మందివ్వక పోవడ మేమిటోయ్. వెర్రి కక్కగట్టలా ఉన్నావ్. మాంసం ముట్టద్దనీ, కర్బనోదకాలు మస్తుగా తినాలనీ చెప్పేను కాదోయ్. ఇదే ఇంగ్లీషు డాక్టరు అయితే 'హై కార్బో హైడ్రేటు డయట్' అని ఇంగ్లీషులో చెబుతాడు. పుట్టుకతో వచ్చిన జబ్బుకి పథ్యమే

మహా అవుషధం. మోతాదుగా తిన్న తిండే కదుటోయ్ అవుషధం.'' అని రామేశంగారు చిన్న కునుకు తియ్యడానికి ప్రయత్నిస్తూ ఉండగా గేటు తలుపు తెరచుకుని సత్యవరం అప్పన్న తాత ఒక మోద తమలపాకులు పట్టుకుని ప్రత్యక్షమయాడు.

''ఆదోరం సంతకొచ్చా బాబూ. తమ దరిసెనం సేసుకుని తమ కాళ్లొకసారి పట్టుకుని పోదామని వచ్చేను, బాబూ. పదేళ్ల కిందట సచ్చిన బొందికి పేణం పోసి బతికించేవు కదా, బాబూ. పేదోణ్ణి. ఈ తవలపాకులు తప్ప ఇంకేమీ ఇచ్చుకోలేను. బాబూ, నేను సచ్చిన తరోత ఈ సెర్మం ఒలిపించి సెప్పులు కుట్టించుకోండి...''

'తాతా, నువ్వు చావా వద్దు, మాకు చెప్పులూ వద్దు. వారం వారం నువ్వు ఇలా బతుకున్నాళ్లూ మాకు తమలపాకులు పట్రానక్కర లేదని నీకు ఎన్ని సార్లు చెప్పాలి? ఎండలో వచ్చావు. ఇంత అన్నం పెడతాను. తిని, కాస్సేపు నీడని అలా పడుకో!'' అంటూ సీతమ్మగారు గదమాయించేసరికి –

''దమ్మ పెబువులు1'' అంటూ తాత అరిటాకేసుకుని చతికిల పడ్డాడు.

రామేశంగారు అప్పటికే చిన్న చిరునిద్రలోకి జారుకున్నారు.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 6 మార్చి 1996 సంచికలో ప్రచురించబడ్డ కథ ఇది.)